# ప్రేమ ద్వేషం

బుచ్చిబాబు బీయస్సీపాస్ అయ్యాడు. టైపూ షార్టుహాండూ పాస్ అయ్యాడు. ఇవన్నీ అయి రెండేళ్ళు దాటింది. వుద్యోగ ప్రయత్నం జోరుగా చేస్తున్నారు. బుచ్చిబాబుకి వుద్యోగం రాలేదు కాని పెళ్ళి జరిగిపోయింది. భార్య జయలక్ష్మి కాపురానికి వచ్చేసింది. బుచ్చిబాబుకి ఒకవైపు సంతోషం. మరోవైపు సంకోచం. పాతికేళ్ళుగా పెంచి పోషించి చదువు సంధ్యలు చెప్పించి వుద్యోగం రాకున్నా మరో బరువు నెత్తికెత్తుకున్న తల్లిదండ్రుల ఔదార్యానికి పూజ్యభావం నిండుగా వుంది మనస్సులో. త్వరగా వుద్యోగం వస్తే నాన్నకి ఆసరాగా నిల్చి చెల్లెలి పెళ్ళి జరిపించి తమ్ముడిని యూనివర్సిటీలో చేర్పించాలి. యిలా కలలు కంటూన్న బుచ్చిబాబుకి మరో రెండేళ్ళ తర్వాత వుద్యోగం వచ్చింది.

"అమ్మయ్య! నా ఆశలు తీర్చుకోవచ్చు" అనుకుంది భార్య జయలక్ష్మి.

"మా కష్టాలు గట్టెక్కాయి, దేవుడు యిప్పటికైనా కరుణించాడు. వున్న వూళ్ళో వుద్యోగం దొరికింది" అనుకున్నారు తల్లి దండ్రులు.

"అన్నయ్యకి వుద్యోగం వచ్చిందిగా యింక సినిమాలు బాగా చూడవచ్చు" అనుకుంది చెల్లెలు సుశీల.

"నాన్న యెప్పుడూ డబ్బులేదంటూ సాదరు ఖర్చుకి పదిరూపాయలే యిస్తున్నారు. ఇంక అన్నయ్య మరో పది యిస్తాడ"ని ఆశపడ్డాడు ఇంటర్ చదువుతూన్న తమ్ముడు.

బుచ్చిబాబుకి మొదటినెల జీతం ఒచ్చింది. ఆ జీతం తీసుకుని ఒకటికి నాలుగుసార్లు లెక్క పెట్టుకుని గాలిలో తేలిపోతూ ఇంటికి వస్తు దారిలో ఒక 'కిలో' స్వీట్లు కొనుక్కుని మరీ వచ్చాడు. వస్తునే రోజులా పడకగదిలోకి నరాసరి వెళ్ళక వంటగదిలో వున్న తల్లిదగ్గరకి వెళ్ళాడు.

"చెల్లాయ్! తమ్ముడూ నాన్నా" యిలా రండి, అంటూ అందరికీ స్వీట్లు పంచాడు.

"జయని కూడా పిలవరా" అంది తల్లి,

"నే రావటం తను చూసిందమ్మా. ఒస్తుందిలే" అన్నాడు.

"అన్నయ్యా! అర్జెంట్ గా ఓ పాతిక యిలా పడెయ్యి, నీకు వుద్యోగం వస్తే నా యిష్ట దైవం అయిన హనుమంతుడికి అప్పాలు చేయిస్తానని మొక్కుకున్నానన్నయ్యా" అన్నాడు తమ్ముడు గోపి.

"అలాగా అందుకే కాబోలు యింత త్వరగా వచ్చింది. సరే అలాగే పూజ చేయిం చెయ్యి" పర్సు తెరిచి పాతిక రూపాయిలూ తమ్ముడి చేతిలో పెట్టాడు.

"అన్నయ్యా నీ మొదటి నెల జీతంలో నా ఫ్రెండ్ దుర్గని సినిమాకి తీసుకువెడతానని మాటిచ్చానన్నయ్యా."

సుశీల బెదురుబెదురుగా అంది.

"ఓ ఇంతేగా. వెళ్ళండమ్మా యిద్దరూ. పదిరూపాయిలు చాలుగా."

చాలు అన్నట్లు తల వూపింది సుశీల.

"బాబూ మరి నాకు ఈనాం యిప్పించరా" పనిమనిషి పద్ది అడిగింది. బుచ్చిబాబు ఓ రూపాయి యిచ్చాడు. అది అందుకుంటూన్నప్పుడు దాని కళ్ళలో కన్పించే సంతోషం చూసి మురిసిపోతూ అన్నాడు.

"పద్దీ! ఏంచేస్తావే ఈ డబ్బు"

"దాచుకుంటా! తిరణాలకెళ్ళినప్పుడు గాజులేయించుకుంటా"

"ఆ ..." నవ్వసాగాడు బుచ్చిబాబు.

"ఏమండీ" అసహనంగా పిల్చింది జయలక్ష్మి గదిలోంచి.

"వస్తున్నా!" స్వీటు పాకెట్‌తోసహా గదిలోకి వెళ్ళి పాకెట్ యిచ్చి—

"జయా నీ యిష్టమైంది తీసుకో" అన్నాడు.

"యిది నాకొద్దు! నాకోసం ప్రత్యేకంగా ఏం తెచ్చారు?" కటువుగా అంది.

"ముందు స్వీటు తినవోయ్"

"ఒద్దు అన్నానా! నాకోసం తెచ్చినదేదో త్వరగా చూపమన్నానా"

"సరే అయితే" అంటూ పూవుంపొట్లం తీసి చేతిలో పెట్టాడు.

"నీకు యిష్టమైన మల్లెలు"

జయలక్ష్మికి ఒళ్ళు మండిపోయింది. అంతే ఆ పొట్లాన్ని విసిరి కొట్టింది. "ఆరువందలు జీతం తీసుకుని అరణాల మల్లెలు తెచ్చారా! సిగ్గు లేకుండా యిస్తున్నారా!"

"జయా"

"మాట్లాడకండి"

"మొదటినెల జీతమేగా వచ్చింది"

"కనుకనే జీవితాంతం గుర్తు వుండేలా యేదైనా మంచి చీరో నగో తెస్తారని కలలు కంటూ కూర్చున్నాను"

బుచ్చిబాబు గతుక్కుమన్నాడు.

"చూడూ మన ఇంటి పరిస్థితి గుర్తుంచుకుని కలలు కనాలి"

"కాపురానికి వచ్చిన దగ్గరనుంచీ యింత వరకూ అవేపని చేశానుగా. యింకా అలాగే యెందుకుండాలి. నామొగుడికి వుద్యోగం వచ్చింది. ఆరొందలు జీతం వచ్చింది"

"జయా! నేను నీకు మొగుడినే కాదు ఓ తల్లికి కొడుకుని. ఓ తండ్రికి ఆసరా కావల్సినవాడిని. ఓ తమ్ముడికీ ఓ చెల్లెలికీ...." బుచ్చిబాబు మాట పూర్తి కాలేదు. "ఆపండి మీ పాత చింతకాయపచ్చడి కబుర్లు కట్టిపెట్టి నే చెప్పినట్లు వినండి."

బుచ్చిబాబు భార్యకి జవాబు చెప్పలేక పోయాడు. జయ తన కోరికల లిస్టుని వరసగా చెప్తోంది. సోఫా సెట్ కావాలి, స్టీల్ బీరువా కావాలి, నెలకో పట్టుచీరె కావాలి, మంచాలు కావాలి, దోమ తెరలు కావాలి.

"యివన్నీ యిప్పుడే యెలా సాధ్యం అవుతాయి."

"అవన్నీ నాకు తెలియవు. నాక్కావాలి. అంతే. జీతం డబ్బుల్లో ఒక్క పైసా కూడా ఇంట్లో యిచ్చేందుకు వీల్లేదు."

"జయా! అర్థం లేకుండా మాట్లాడకు"

"మాట్లాడతాను."

బుచ్చిబాబుకి జయ పెంకితనం బాగా తెల్సిపోయింది. కనుకనే యింకేం మాట్లాడకుండా బట్టలు మార్చుకుని బైటికి వచ్చాడు. తల్లీ తండ్రీ కూర్చుని లెక్కలు వేసుకుంటున్నారు. కొడుక్కు వచ్చే జీతంలో అప్పులు నెలకి యెంతెంత తీర్చుకునే వీలుంటుందో! యిది వింటూ తల రెండు చేతుల్లోనూ పట్టుకుని కూలబడిపోయాడు.

## 2

రెండు నెలలు కూడా జరగలేదు. తను కావాలన్న లిష్టులో ఒక్క సామానన్నా కొనని భర్తమీద కారాలూ మిరియాలూ నూరసాగింది జయలక్ష్మి. ఈ కోపంలో ఇల్లు నరకంగా మార్చసాగింది. అత్తగారి మీద సూటీ పోటీ మాటలు విసరసాగింది.

"కొడుక్కి పెళ్ళి చేయగానే సరిపోదు. కొడుక్కు చేసుకున్న పిల్ల సుఖంగా కాపురం చేసుకోవాలన్న ఇంగితజ్ఞానం వుండదీ ముసలాళ్ళకి. ఈ ఇల్లులాంటి ఇంటినిగానీ ఈ ఇంట్లో వుండే మనుషుల్లాంటి వాళ్ళనిగానీ నే యెక్కడా చూడలేదు. కూడి మనుషులు. ఇదో నరకం. ఈ నరకంలో నే వుండలేను."

కోడలి మాటలు విని గాభరా పడిపోయారు తల్లిదండ్రులు. సుశీల వికృముఖం వేసుకుని చూడసాగింది. గోపి వదినగారివైపు చిత్రంగా చూడసాగాడు. "ఈవిడ మనిషేనా! ఇన్నాళ్ళూ మా మధ్యన వుంటూ తింటూన్న వదినేనా ఇలా వాగుతున్నది! ఆశ్చర్యంగా వుందే!" అనుకున్నాడు.

బుచ్చిబాబు మాత్రం భార్య ప్రవర్తనని సరిదిద్దాలని విశ్వ ప్రయత్నం చేయసాగాడు. సామాన్య సంసారాల్లో పిల్లలని పెంచి పెద్ద చేసే ప్రయత్నంలో తల్లిదండ్రులు యెంత కష్టపడతారో వుదాహరణలతో సహా చూపాడు. యివన్నీ సావధానంగా విని ఆ తర్వాత గయ్యిమని లేచేది.

"నాకూ తెల్సు తల్లిదండ్రులని గురించి. కన్నందుకు పెంచాలి, కానీ ప్రతిఫలం ఆశించకూడదు. ఇదే ఈనాటి రూ." గొంతు చించుకుని అరిచింది జయ.

"ఓ అయితే మీ అన్నయ్యా వదినా...."

"వాళ్ళ మాట అడగండి చెప్తాను. మా వదిన చాలా మంచిది. మా అమ్మ కాలుకింద పెట్టకుండా ఇల్లు దిద్దుకుంది. మాకందరికీ కావల్సినవన్నీ చేస్తుంది. మా అన్నయ్యకి నేమంటే ప్రాణం. అన్నట్లు మరిచాను. పండక్కి మనిద్దరినీ రమ్మని అన్నయ్యా వదినా కల్సి వుత్తరం రాశారు శలవు పెట్టండి వెడదాం హాయిగా."

బుచ్చిబాబు జవాబు చెప్పలేదు కానీ తీవ్రంగా ఆలోచించసాగాడు. బుచ్చిబాబుకి నాలుగో నెల జీతం వచ్చింది. స్వీట్లు తేలేదు కానీ భార్యకి

ఓ చీర తెచ్చాడు.

"ఇదా ఛీ! వాయిల్ చీరె" అంటూ విసిరి కొట్టింది. బుచ్చిబాబు ముఖం చిన్నబోయింది.

"ఓ గెజెటెడ్ ఆఫీసర్ని చేసుకోలేక పోయావు. గుమాస్తాగాడిని వాయిల్ చీరెగాక పట్టుచీరె తేగలనా!" అన్నాడు కోపంగా. విసుగ్గా యివతలకి వచ్చేశాడు. తల్లి యేదో పని చేసుకుంటూ వుంటే దగ్గరగా వెళ్ళాడు.

"అమ్మా ఈ మూడు వందలూ ఇంటి ఖర్చుకి వుంచమ్మా." చేతిలో పెట్టబోయాడు. ఆవిడ అందుకోలేదు.

"నాయనా ఇంటి ఖర్చులు మేం చూసుకుంటాంలే. మీ నాన్న పార్టు టైము వుద్యోగం కూడా చూసుకున్నారు. అది మీరు వుంచుకోండి. మీకు కావల్సినవి కొనుక్కోండి. మిమ్మల్ని కన్నందుకు పెంచి విద్యాబుద్ధులు చెప్పించ గలిగాం కాని మీ అవసరాలకి సరిపడ డబ్బుమూటలు యివ్వలేం నాయనా! మాకా శక్తి లేదు. నీకు వుద్యోగం దొరికిందంటే మేం నీ సంపాదనలో కొంత భాగంకోసం ఆశపడిన మాట నిజమే. అయితే అది తప్పు అన్నది తెల్సుకున్నాం. కనుక....నీ డబ్బు మాకక్కరలేదు."

"అమ్మా!"

"నామాటలు నీకు బాధ కల్గించ వచ్చు. కాని ఎందుకులే మాట వెంట మాట వస్తుంది. అది ఘర్షణకి దారితీస్తుంది. మన ఇంట్లోని మాట ఈనాటి వరకూ బైటకి వెళ్ళి యెరగం. కనుక....ని నేనింకేం చెప్పలేను."

"అమ్మా!" నువ్వు కూడా యిలా మాట్లాడితే యెలా!"

తల్లి-మనసులోని ఆవేదనని అణుచుకుంటూ మరో మాటకి అవకాశం యివ్వకుండా అక్కడినించి వెళ్ళిపోయింది. బుచ్చిబాబు మనసులో వ్యధగా వుంది.

తండ్రి మరో బరువు నెత్తికెత్తుకున్నాడా! యెందుకు! జయమాటలు వినా!

విసురుగా లోపలికి వచ్చి చేతిలోని నోట్లు విసిరి భార్య ముఖానికేసి కొట్టాడు.

జయ అర్థం కానట్లు చూడసాగింది. ఆ తర్వాత హేళనగా అంది.
"యేం! మీరిచ్చిన డబ్బు వాళ్ళకి చాలి వుండదు! యిప్పుడైనా తెల్సిందా వాళ్ళ నైజం."

"జయా! నీ రూపానికి స్వభావానికీ యెంత భేదం వుంది. నీ రూపం చూసి.... చూసి దానిలానే మనసూ అందమైనదని నిన్నే కావాలని పెళ్ళాడాను. కానీ..." మాట పూర్తి చేయబుద్ధి కాలేదు కాబోలు చెప్పులు వేసుకుని చరచరా వీధిలోకి నడిచాడు.

నాలుగు రోజులు గడిచినా జయ శాంతిగా బ్రతకనీయటం లేదు.
"మావాళ్ళింటికి వెళ్ళిపోదాం అండి! అక్కడ స్వర్గంలా వుంటుంది."
బుచ్చిబాబు చెవులో రొద పెట్టసాగింది.
"సరె నీవు చెప్పినట్టే చేద్దాం. బట్టలు సర్దు" అన్నాడు యేదో తీవ్రంగా ఆలోచిస్తూ.

జయ ముఖం సంతోషంతో వెలిగిపోయింది క్షణం. అంతే చీరె కొంగు నడుం దగ్గర దోపింది. శ్యామల స్కూలుకి తీసుకువెళ్ళే టిఫెను బాక్సు గోపి బట్టలు పెట్టుకున్న సూట్ కేసూ అత్తగారు పూజకి పూలు. కోసుకున్న పూల సజ్జతో సహా బుచ్చిబాబు పేరున్న ప్రతి సామానూ తెచ్చి గదిమధ్యన పోగులా పెట్టి ఒక్కొటితుడిచి పెట్టెల్లో సర్దసాగింది.
"యిదేమిటి ప్రయాణానికి ఈ సామానెందుకూ" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇదంతా మనదండీ"

"అంటే?"

"మన పెళ్ళికి మీ చుట్టాలు అందరూ ఇచ్చిన ప్రజంటేషన్స అండీ"

"ఓ అలాగా! అయితే మీ చుట్టాలు నీకిచ్చిన సామానేదీ"

"మా అమ్మదగ్గర దాచుకున్నాను ఇక్కడికి ఒక్కటీ తేలేదు."

"ఐసీ! అయితే ఇదంతా యిక్కడే వుండనీయి. యివన్నీ యిచ్చింది అమ్మ తరుపువారూ నాన్న స్నేహితులూ గోపీ దోస్తులూ సుశీల క్లాసు మేట్సూ ...వగైరా! కనుక యివన్ని యిక్కడే వుండనియి"

"అయ్యో పిచ్చి మాలోకం! యిక్కడ వుంచితే ఒక్కటీ మనకు దక్కదు మనది అనేది మనదగ్గరే వుంచుకోవాలండీ"

"అలాగా! అయితే మా నాన్నని అమ్మని చెల్లాయిని తమ్ముడినే కూడా మీ వాళ్ళ యింటికి తీసుకుపోదాం."

"ఖర్మ వీళ్ళంతా యెందుకండీ"

"వీళ్ళూ మనవాళ్ళేగా!"

"ఖర్మ మీకు యెలా చెప్పాలో అర్థం కావటం లేదు."

"సరె! నేనే అర్థం చేసుకుంటాలేగాని ఓ రహస్యం అడుగుతాను చెప్పు. యింతకీ ని కిక్కడ కలిగే అసౌకర్యం యేమిటి? యెవరు నిన్ను సరిగా చూడటం లేదు? నికు వచ్చిన యిబ్బంది ఏమిటి!

"మళ్ళా మొదటికి వచ్చారూ!"

"మొదటికి రాలేదు. చివరికే వస్తున్నాను. యెలాగూ వెళ్లి పోతూన్నాంగా చెప్పు."

"ఈ మనుషులని చూస్తే నాకు పడదు. నాకి ఇంట్లో స్వేచ్ఛలేదు. స్వతంత్ర లేదు"

"అంటే యివన్నీ నీ నుంచి మరొకరు లాక్కున్నారా! అయితే యెవరాలాక్కుంది చెప్పు."

"యెవరో నాకు తెలియదుకాని నాకే విసుగ్గా వుంది. నిజం చెప్పాలంటే మీ అమ్మ మిత భాషి అంటారుగాని నిజం కాదు. ఆవిడ నాలిముచ్చు. మీ చెల్లెలో గారాల పూచి. నేనంటే అస్సలు గౌరవం లేదు. అభిమానం లేదు."

"సుశీలని నువ్వు ఆత్మీయంగా యెప్పుడన్నా పిలిచావా!"

"నాకేం అవసరం?"

"నీవిలా అనుకుంటే వాళ్ళు నీలాగే అనుకోవచ్చుగా! యెవరి సంగతో వదిలెయ్యి. అమ్మ నిన్ను ఆత్మీయంగా పల్కరిస్తుందిగా. అయినా జవాబు చెప్పవెందుకు?"

"నాకు చెప్పటం యిష్టం వుండదు."

"అల్‌రైట్! చూడూ ఈ ఇంట్లోకి నువ్వు యెలా వచ్చావో అలాగే ప్రయాణం కావాలి. నేను మాత్రమే నీ వాడిని కనుక నే ఒక్కడినే వస్తాను. ఆ సామాను అలా వదులు. అర్థమైందా పద వెడదాం"

జయ కళ్ళు నీళ్ళపర్యంతం అయింది. అయినా యేం చేయలేక తన బట్టలు మాత్రం సర్దుకుని బైటకి రాబోతూంటే బుచ్చిబాబు అన్నాడు.

"అమ్మకీ నాన్నకీ చెప్పిరా"

"చెప్పను. వాళ్ళు అదోలా చూస్తారు."

"సరె పద" అని తనుమాత్రం తల్లి దండ్రులకి చెప్పి ఆటో యెక్కాడు. తల్లి కళ్ళలో గిర్రున తిరుగుతూన్న నీళ్ళని చూసి భరించలేక తల తిప్పుకున్నాడు.

# 3

జయ సంతోషానికి అంతులేదు. అన్నా వదినా జయకీ బుచ్చిబాబుకీ మర్యాదలు ఘనంగా చేస్తున్నారు. తల్లి దండ్రులు మాత్రం చికాకు పడసాగారు.

"నీకిదేంబుద్దే" అని మందలించబోయారు. జయ వాళ్ళమీద విరుచుకు పడింది.

"ఈకాలం అమ్మాయిని నేను. నాకు నచ్చినట్లు వుంటాను గాని పెద్దవాళ్ళూ మంచీ మర్యాదా నా కొద్దు. నా భర్త సంపాదనలో పూచిక పుల్ల కూడా వాళ్లు తినటానికి వీల్లేదు. నాభర్త నా హక్కు"

ఈ గోల అల్లుడు యెక్కడ వింటాడో అని వాళ్లు నోరు మూసుకున్నారు.

వదినగారు జయని పరిహాసంగా అంది. "అమ్మో యేమో అనుకున్నాను. మా తమ్ముడికి వుద్యోగం రానంత వరకూ వాళ్ళతోనే వుండి వుద్యోగం రాగానే ప్లేటు ఫిరాయించి భర్తని కొంగుకి కట్టుకుని లాక్కు మరీ వచ్చావు. భేష్ జయా! నీధైర్యానికి జోహార్లు" "యేమిటనుకున్నావ్ వదినా ఈ జయ అంటే!" గర్వంగా కళ్లు యెగరేసింది జయలక్షి. భర్త ఆఫీసునించి రాగానే రోజూ సినిమాకో తిరుగుతూ హాయిగా ఆనందంగా ఒక వారం రోజులు గడిపేశారు ఆదివారం మేట్నీకి వెళ్ళారు.

సినిమా చూస్తూ భర్త చేతిని చేతిలోకి తీసుకుని ప్రేమగా నొక్కుతూ అంది జయ.

"నా మాట విన్నారు గనుకనే మనకీనాడింత సంతోషంగా గడుస్తోంది. ఫస్టుకి జీతం రాగానే కొనవల్సిన వన్ని లిష్టు రాసి వుంచాను" అంది.

"నిజం జయా నిజం" అన్నాడు బుచ్చిబాబు. సినీమా పూర్తయింది, హోటల్‌కి వెళ్ళి టిఫెనూ కాఫీ తీసుకుని ఆటోలో ఇంటికి వచ్చారు, ఇంటి

తలుపులు బార్లా తెరిచి వున్నాయి. ఇల్లంతా ఖాళీగా వుంది. తల్లీ తండ్రి చెరో ప్రక్కనా కూర్చున్నారు. వారి ముఖాల్లో విచారం కన్పిస్తోంది. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

జయ లోపలికి వచ్చి అసలేం జరిగిందో అర్థం కాక ఏమైందమ్మా అంది గాభరాగా.

"అమ్మా జయా! ఆ పాపిష్టిది యిన్నాళ్ళు మనలో మంచిగా కల్సి మెల్సి వుంటున్నట్లే వుండి అన్నయ్యకి ప్రమోషన్ ఒచ్చి జీతం పెరగ్గానే వాడికి మాయమాటలు చెప్పి చవటని చేసి తన పెంపుడు కుక్కని చేసుకుని వాళ్ళ పుట్టింటికి తీసుకుపోయిందే తల్లి. మళ్ళీ ఈ ఇంట్లో కాలు పెట్టం అని చెప్పి మరీ వెళ్లారు. మీదారి మీరు చూసుకోండి అన్నారు. నా మొగుడు నా యిష్టం. అని నా ముఖం మీద అని మరీ వెళ్లింది."

"ఆ మన వదిన ... యిలా చేసిందా! నేనమ్మను"

"మేమూ అలాగే అనుకున్నాం. జరిగింది కల అనుకున్నాం తల్లీ. కానీ అది కలకాదు నిజం అని ఖాళీ ఇల్లు సాక్ష్యం చెప్పటం లేదూ? వెడుతూ మరో మాట అంది. నేవెళ్లినా మీకేం వున్నారుగా మీ కూతురూ అల్లుడూ వాళ్ళని పోషించమనండి" తల్లి యిదంతా చెప్పి వెక్కివెక్కి యేడవసాగింది జయ తల తిరిగిపోయింది. తన భర్త జీతంలో కొన వల్సిన లిస్టు కళ్ళలో మెదిలింది. తల్లిదండ్రులే అయినా వీళ్లిద్దరి భారమూ నెత్తికెత్తుకుంటే మొద్దుని వదిలి దుంనని యెత్తుకున్నట్లు కాదా! తన సంతోషం మొగ్గలోనే తుంచేసిన వదినగారిని తిట్టసాగింది. తల్లి మరీ తిట్టిపోస్తోంది కోడలిని. యిదంతా వింటూన్న బుచ్చిబాబు జయవైపు జాలిగా చూశాడు జయ వదినగార్ని తిట్టితిట్టి అల్సిపోయింది. బుచ్చిబాబు భార్య దగ్గరగా వచ్చాడు ప్రేమగా చూస్తూఅన్నాడు

"జయా! మ వదిన యిన్నాళ్ళు నిన్ను యెంతో అభిమానంగా చూసింది యదార్థమే కదూ! కానీ యెందువల్లనో యిప్పుడిలా చేసింది.

యిలా చేసిందని ద్వేషిస్తావా జయా! నా మాట ఒక్కటి విను. ప్రేమని టెలిస్కోప్‌లో చూడాలి. ద్వేషాన్ని మైక్రోస్కోప్‌లో చూడాలి. యిలా చూసినప్పుడు మన మనస్సులో అశాంతి వుండదు."

జయ భర్త మాటలని శ్రద్ధగా వింది. ఆలోచించసాగింది. తన తల్లి కోడలిని తిట్టేతిట్లలో యేదో గూఢార్థం ధ్వనించసాగింది. అది పూర్తిగా అర్థం అవసాగింది. తనలో తను అనుకుంది. యేమండీ మీరన్నట్లుగా ప్రేమని టెలిస్కోపులో చూడాలి ద్వేషాన్ని మైక్రోస్కోప్‌లో చూస్తె చూస్తె " పావుగంట గడిచింది. అంతే జయ లేచి నిల్చుంది.

"ఏమండీ మనంటికి వెళ్లిపోదాం! నా తప్పు తెల్సుకున్నాను త్వరగా వెడదాం మీరేనావారు అనుకున్నాను. మీతోబాటు మీవాళ్ళంతా నావాళ్ళే" అంతే బుచ్చిబాబుతోబాటు అత్తవారింటిముందు ఆటో దిగింది.

నాలుగు రోజులు కాకుండానే తన వదిన అన్నా తిరిగి తల్లిదండ్రుల దగ్గరకి వచ్చారన్న వార్త విన్న జయ ఆశ్చర్యం నుంచీ తేరుకుంటూ బుచ్చిబాబువైపు అనుమానంగా చూసింది. అతను వచ్చే నవ్వును దాచుకుంటూ 'జయా మనకి బాబా పాపా' అంటూ దగ్గరకి తీసుకున్నాడు. అత్తగారు కోడలికోసం చేస్తూన్న తీపిపిండివంట తాలూకు కమ్మనివాసన ఇల్లంతా గుబాళిస్తోంది.

వనిత మాసపత్రిక (దీపావళి సంచిక నవంబర్. 1980)